# సాక్షి
## పల్నాడు
బుధవారం ౹ 31 ౹ జనవరి ౹ 2024






### త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం
తెనాలిటౌన్: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో త్యాగరాజ గానసభ ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాజస్వామి 57వ ఆరాధనోత్సవాన్ని జరిపారు.




### జాతిపితకు ఘన నివాళి
పాత గుంటూరు : గుంటూరు మార్కెట్‌సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### నేడు డయల్‌యువర్ కలెక్టర్

నరసరావుపేట: ఎన్నికలను పురస్కరించుకొని ప్రతి బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న 'డయల్ యువర్ కలెక్టర్' ఉదయం 10 నుంచి 11గంటల వరకు జరుగుతుందని కలెక్టర్ ఎల్.శివశంకర్ మంగళవారం తెలిపారు. 08647-7252999 నంబరుకు డయల్ చేసి సమస్యలను వివరించాలని కోరారు.

## న్యూస్‌రీల్

### తైక్వాండోలో పతకాల పంట

తెనాలిటౌన్: బెంగళూరులో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగిన 6వ జాతీయస్థాయి ఓపెన్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో యూనిక్ తైక్వాండో క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించినట్లు కోచ్ బట్టు నాగరాజు మంగళవారం తెలిపారు. పోటీలో తొమ్మిదిమంది క్రీడాకారులు రెండు విభాగాల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచి 8 స్వర్ణ, 8 రజత, 2 కాంస్య పతకాలు సాధించినట్లు చెప్పారు. వినయ్, లిఫాస్, జవితేష్, వినమ్ కౌసిక్, విజయ్, ఈశ్వర్‌లు స్వర్ణ పతకాలు, జివితేష్, కౌసిక్, ఈశ్వర్, జయనత్, కార్తికేయ, వినూత్నలు రజత పతకాలు, విజయ్, వినూత్నలు కాంస్య పతకాలను సాధించినట్లు కోచ్ నాగరాజు తెలిపారు.

### సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 520.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 22,638, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 822.40 అడుగుల వద్ద ఉంది.

### యార్డుకు 1,30,851 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,30,851 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,25,366 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 71,581 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

### నిబంధనలు పాటించేలా దృష్టి సారించాలి

పట్నంబజారు: వాహన షోరూం డీలర్‌లు తప్పకుండా ప్రతి ఒక్క వాహనదారుడు వాహనం కొనుగోలు చేసే సమయంలో నిబంధనలకు అనుగుణంగా నడుచుకునేలా దృష్టి సారించాలని డీటీసీ షేక్ కరీం సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్వర్ణభారతినగర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో మంగళవారం షోరూం డీలర్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీటీసీ కరీం మాట్లాడుతూ వాహనదారులు వాహనం కొనుగోలు చేసే సమయంలో తప్పసరిగా ఐఎస్ఐ మార్కుతో ఉన్న హెల్మెట్‌ను తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. గత ఏడాది గుంటూరు జిల్లాలో 965 ప్రమాదాలు జరగగా, అందులో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న 230 మంది దుర్మణం పాలయ్యారని తెలియజేశారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృత్తం కాకుండా వాహనదారులకు హెల్మెట్‌లు అందజేయాలని సూచించారు. అనంతరం వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంవిఐలు ఎస్ గోపాల్, జి.సౌజన్య, షోరూం డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

### నిమ్మకాయల ధరలు
తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4500, గరిష్ట ధర రూ.6300, మోడల్ ధర రూ.5400 వరకు పలికింది.

# ఆడుదాం.. గెలుద్దాం!

- నేటి నుంచి జిల్లాస్థాయి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలు
- హోరాహోరీగా సాగిన మండలస్థాయి పోటీలు
- ప్రతిభ చాటిన పలువురు క్రీడాకారులు
- సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి జిల్లాకు 10 జట్లు ఎంపిక


క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచి కప్ అందుకుంటున్న సత్తెనపల్లి క్రీడాకారులు

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీలు సత్తెనపల్లి నియోజకవర్గంలో హోరాహోరీగా సాగాయి. సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్ పరిధిలో 34 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిపరిధిలో 7,752 మంది క్రీడాకారులు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. గత డిసెంబర్ 26 నుంచి ఈనెల 9 వరకు గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల విజేతలు మండలస్థాయికి అర్హత సాధించారు. ఈ నెల 10 నుంచి 23 వరకు మండలస్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లోని విజేతలకు క్రీడా పరికరాల కిట్లు పంపిణీ చేశారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన జట్లు నియోజకవర్గస్థాయి పోటీలకు అర్హత సాధించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలకు సంబంధించి నియోజకవర్గస్థాయిలో ప్రతిభ చూపి విజేతలుగా నిలిచిన జట్లకు ప్రథమ స్థానానికి రూ.35 వేలు, ద్వితీయ స్థానానికి రూ.15 వేలు, తృతీయ స్థానానికి రూ.5 వేలు, బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానానికి రూ.20 వేలు, ద్వితీయ స్థానానికి రూ.10 వేలు, తృతీయ స్థానానికి రూ.5 వేలు నగదు బహుమతులను ప్రభుత్వం అందించనుంది. మొత్తం ఐదు క్రీడల్లో ప్రతిభ చూపిన బాల, బాలికల 10 జట్లు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించాయి. ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు జిల్లాస్థాయిలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు నరసరావుపేటలో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల విజేతలకు ప్రథమస్థానానికి రూ.60 వేలు, ద్వితీయ స్థానానికి రూ.30 వేలు, తృతీయ స్థానానికి రూ.10వేలు, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ స్థానానికి రూ.35 వేలు, ద్వితీయ స్థానానికి రూ.20 వేలు, తృతీయ స్థానానికి రూ.10 వేలు నగదు బహుమతులు ప్రభుత్వం అందించనుంది. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో జట్లకు ప్రథమ స్థానానికి రూ.5 లక్షలు, ద్వితీయ స్థానానికి రూ.3 లక్షలు, తృతీయ స్థానానికి రూ.2 లక్షలు, బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానానికి రూ.2 లక్షలు, ద్వితీయస్థానానికి రూ.లక్ష, తృతీయ స్థానానికి రూ.50 వేలు నగదు బహుమతులను ప్రభుత్వం అందించనుంది. సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఐదుక్రీడల్లో ఒక్కో క్రీడకు బాల, బాలికల చొప్పున 10 జట్లు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించాయి. 'ఆడుదాం ఆంధ్ర' షెడ్యూల్ ప్రకారం బుధవారం నుంచి నరసరావుపేటలో జరగనున్న జిల్లాస్థాయి పోటీల్లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్నారు.

**జిల్లాకు అర్హత సాధించిన జట్లు ఇవే..**

| క్రీడ పేరు | ప్రథమ స్థానం (బాలురు) | ప్రథమ స్థానం (బాలికలు) |
|---|---|---|
| బ్యాడ్మింటన్ | సత్తెనపల్లి | సత్తెనపల్లి |
| వాలీబాల్ | ముప్పాళ్ళ | ముప్పాళ్ళ |
| ఖోఖో | నకరికల్లు | రాజుపాలెం |
| కబడ్డీ | నకరికల్లు | నకరికల్లు |
| క్రికెట్ | సత్తెనపల్లి | ముప్పాళ్ళ |

### క్రీడలకు మరింత ప్రోత్సాహం..

క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయాలనే ప్రభుత్వ ఆశయం గొప్పది. 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడాకారులను ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తుంది. సచివాలయ స్థాయిలో విజయం సాధిస్తే క్రీడా కిట్లను అందించింది. మండల స్థాయి నుంచి నగదు ప్రోత్సాహకాలను అందిస్తోంది. నేను బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రస్తుతం జిల్లాస్థాయికి అర్హత సాధించా.

– సీహెచ్ సురేంద్ర, క్రీడాకారుడు, సత్తెనపల్లి

### అవకాశాన్ని వినియోగించుకున్నా..

'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలతో వచ్చిన అవకాశాన్ని వినియోగించుకున్నా. కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకుని తలపడ్డా. మా జట్టు మూడుస్థాయిల్లో విజయం సాధించి జిల్లాస్థాయికి అర్హత సాధించింది. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించగలననే నమ్మకం బలంగా ఏర్పడింది.

– పి.తిరుపతమ్మ, క్రీడాకారిణి, నకరికల్లు


స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

# సమన్వయంతో సమగ్రాభివృద్ధి

- పురోగతిలో అభివృద్ధి కార్యక్రమాలు
- రూ.5 కోట్ల జెడ్పీ నిధులతో వివిధ దశల్లో అభివృద్ధి పనులు
- రహదారులు, కాలువల నిర్మాణంతో గ్రామాలకు మహర్దశ
- జెడ్పీలో సమావేశమైన స్థాయీ సంఘాలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ప్రజా పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులతో గ్రామీణ ప్రాంతాల స్వరూపం సమూలంగా మారిపోయిందని, అందరి సమన్వయంతో ఉమ్మడి జిల్లాలో సమగ్రాభివృద్ధి జరిగిందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామీణ ప్రాంతాలు కళకళ లాడుతున్నాయని అన్నారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో స్థాయీ సంఘాలు భేటీ అయ్యాయి. ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య–వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధ్యక్షతన ఆమె చాంబర్‌లో జరిగాయి. అజెండాలో పొందుపర్చిన అంశాలపై జెడ్పీ సీఈఓ జె.మోహనరావుతో కలిసి హెనీ క్రిస్టినా ఆయా శాఖల అధికారులతో చర్చించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రూ.కోట్లాది జెడ్పీ నిధులతో చేపట్టిన పనులు అభివృద్ధికి ప్రత్యక్ష నిదర్శనాలుగా కనిపిస్తున్నాయని చెప్పారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జెడ్పీ ద్వారా మంజూరు చేసిన రూ.5 కోట్ల విలువైన పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నవీ సమగ్ర నివేదిక సమర్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, శానిటేషన్ శాఖల అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యులు సమర్పించిన ప్రతిపాదనలకు అనుగుణంగా పెద్దఎత్తున మంజూరు చేసిన పనుల పురోగతిపై సమగ్ర వివరాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మౌలిక వసతులను కల్పించడంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు.

**జగనన్న విద్యాజ్యోతితో నూరుశాతం ఉత్తీర్ణత..**

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు అధిక మార్కుల సాధనకు జెడ్పీ నిధులతో పంపిణీ చేసిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంలో దోహదం చేస్తుందని హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. వరుసగా రెండో ఏడాది రూ.77లక్షల జెడ్పీ నిధులతో 38,269 మంది విద్యార్థులకు పంపిణీ చేసినట్లు చెప్పారు.

**'పది' విద్యార్థులకు అల్పాహారం..**

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు జెడ్పీ నిధులతో సాయంత్రం వేళల్లో అల్పాహారాన్ని అందించేందుకు సర్వసభ్య సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు పబ్లిక్ పరీక్షలకు నెలరోజుల ముందు నుంచి అమలు చేయనున్నట్లు హెనీ క్రిస్టినా చెప్పారు. స్థాయీ సంఘ సమావేశాల్లో భాగంగా వ్యవసాయంపై 3వ స్థాయి సంఘం జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ–శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘం తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘం సమావేశాలు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరిగాయి.

# మాటే మంత్రం

- ఇచ్చిన మాటకు కట్టుబడి రుణాలు మాఫీ చేసిన సీఎం వైఎస్ జగన్
- రూ.2,570 కోట్లు రుణమాఫీ ద్వారా మహిళల ఖాతాల్లో జమ
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో అంబరాన్నంటేలా వైఎస్సార్ ఆసరా సంబరాలు


సత్తెనపల్లిలో ఆసరా నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళల రుణాలు పూర్తిగా మాఫీచేశారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మెప్మా, వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల్లో మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సభకు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా సంఘాల మహిళల, రైతుల రుణాలు పూర్తిగా రుణమాఫీ చేస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చాడని, అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీ చేయకుండా మహిళలను మోసం చేశాడని గుర్తు చేశారు. రైతుల రుణాలు మాఫీ చేయకుండా కోటయ్య కమిషన్, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అంటూ రైతులను ఇబ్బందులకు గురి చేశాడన్నారు. తాను అధికారంలో వస్తే 2019 ఏప్రిల్ నాటికి రాష్ట్రంలో డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల్లో ఉన్న అప్పును నాలుగు విడతల్లో చెల్లిస్తానని, 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే మూడు విడతల్లో మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని ప్రస్తుతం నాలుగో విడత జమ చేశారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు విడతల్లో డ్వాక్రా మహిళలకు చెందిన రూ.25,570 కోట్ల నగదును వారి ఖాతాలకు జమ చేశారన్నారు. ప్రతి మహిళ సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ప్రతిపక్షాలు కట్టకట్టుకొని వచ్చినా మీ అందరి ఆశీర్వాదం ఉంటే జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరన్నారు. మీకోసం జగన్‌మోహన్ రెడ్డి అనేకసార్లు బటన్ నొక్కుతున్నారని, మీరు రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కితే మళ్లీ ఐదు సంవత్సరాల పాటు మీ కోసం సీఎం జగన్ బటన్ నొక్కుతూనే ఉంటారన్నారు. వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా సత్తెనపల్లి నియోజకవర్గంలోని 4,572 డ్వాక్రా సంఘాల్లోని 44,458 మంది సభ్యుల ఖాతాల్లో నాలుగు విడతల్లో రుణమాఫీ నిధులు రూ.151.55 కోట్లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జమ చేసిందని చెప్పారు. పట్టణంలో 702 సంఘాలల్లోని 6,936 మంది సభ్యులకు రూ.5.68 కోట్లు, సత్తెనపల్లి రూరల్ మండల పరిధిలోని 1,318 సంఘాల్లోని 12,859 మంది సభ్యులకు రూ.10.91 కోట్లు ఆసరా నమూనా చెక్కులను పంపిణీ చేశారు. తొలుత మంత్రి అంబటి రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్ సీపీ నాయకులు రాయపాటి పురుషోత్తమరావు, చల్లంచర్ల సాంబశివరావు, షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, కళ్లం విజయభాస్కర్ రెడ్డి అచ్యుత శివప్రసాద్, షేక్ మౌలాలి, చిలుక జైపాల్, భవనం శివమ్మ తదితరులు ఉన్నారు.

### సీనియర్ అసిస్టెంట్‌లకు ప్రమోషన్
గుంటూరు మెడికల్ : ముప్పాళ్ల పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.సీతారామిరెడ్డికి నెల్లూరు డీఎంహెచ్ఓ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ ఇచ్చి బదిలీ చేశారు. మంగళవారం గుంటూరులోని ఆర్డీ కార్యాలయంలో ఆర్డీ డాక్టర్ శోభారాణి కౌన్సెలింగ్ నిర్వహించి ప్రమోషన్ ఉత్తర్వులు అందజేశారు. డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ సుధీర్, సీనియర్ అసిస్టెంట్ బూసి శ్యామ్‌అనిల్ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు.

### రేపటి నుంచి జాతీయ హాస్య నాటిక పోటీలు
విజయవాడ కల్చరల్: తమ సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి నాలుగు రోజులపాటు జాతీయ హాస్య నాటిక పోటీలు జరుగుతాయని సుమధుర కళానికేతన్ అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు తెలిపారు. బందరురోడ్డులోని ఓ హోటల్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో నాటిక పోటీలు జరుగుతాయని తెలిపారు. 2024 సంవత్సరానికి సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్‌కు జంధ్యాల స్మారక పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు.

# ఖరీఫ్‌కు సన్నద్ధం చేయండి

**వ్యవసాయ సలహామండలి సమావేశంలో జిల్లా కలెక్టర్**


ప్రకృతి వ్యవసాయ విధానంతో పండిన ఆకుకూరలను కలెక్టర్‌కు అందజేస్తున్న డీపీఓ

నరసరావుపేట: ఈ ఏడాది ఖరీఫ్‌లో వ్యవసాయ అనుబంధ శాఖలు రైతులకోసం ప్రణాళికలు రూపొందించి సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ పాల్గొని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. జిల్లాలో ఎక్కడా రైతుల ఆత్మహత్యలకు తావులేకుండా అధికారులు వ్యవహరించాలని కోరారు. చైర్‌పర్సన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన విత్తనాలను అంచనా వేసి సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు ముందుగా అందేవిధంగా చూడాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ రబీలో సాగుచేసిన పంటల విస్తీర్ణాన్ని ఈ–క్రాప్‌లో నమోదుచేయడం జరుగుతుందన్నారు. ఖరీఫ్‌లో సాగుకాని విస్తీర్ణంలో రబీలో శనగ, కంది పంటలు సాగు చేసినట్లు తెలిపారు.

**ప్రకృతి పంటలతో ఆరోగ్యం..**

పురుగు మందులు లేకుండా ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఆకుకూరలు అమృతంతో సమానమని, ఈ విధానంలో ప్రతిఒక్కరు ఆకుకూరలు, కూరగాయలు పెరటి తోటల్లో పండించుకొని తినటం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. నరసరావుపేట మండలంలోని అల్లూరువారిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఆకుకూరలను సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులకు ప్రకృతి వ్యవసాయ విభాగ డీపీఓ అమలకుమారి అందజేశారు. డీఆర్ఓ కె.వినాయకం, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ఎం.గంగాదేవి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కంచేటిపై చర్యలు తీసుకోవాలంటూ వినతి

క్రోసూరు: నాలుగురోజులుగా సోషల్ మీడియా ద్వారా టీడీపీ నాయకుడు కంచేటి సాయిబాబు ఎమ్మెల్యే నంబూరు శంకరరావును వ్యక్తిగతంగా దూషించడమే, రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నాడని, త్వరలో తరిమికొడతామంటూ వ్యాఖ్యలు చేయటం చేస్తున్నాడని వైఎస్సార్ సీపీ కార్యకర్త గార్లపాటిదాసు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో సాయిపై అనేక నేరారోపణలు ఉన్నాయని, టీడీపీలో చేరి గ్రామాల్లో ప్రజల్లో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆయన ఆరోపించారు. సదరు వ్యక్తిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఎస్ఐ నరసింహారావు తెలిపారు.

### బాలల హక్కుల పరిరక్షణకు కృషి

#### బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి

బాపట్లఅర్బన్: బాలల హక్కుల పరిరక్షణ, శ్రేయస్సును ఆకాంక్షించేలా వివిధ ప్రభుత్వ శాఖలు ప్రణాళికతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి కోరారు. జిల్లా పర్యటనలో భాగంగా బాపట్ల టౌన్ స్పందన కార్యాలయంలో డీఆర్వో వెంకటరమణ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా విభాగాల్లో అమలవుతున్న బాలల హక్కులు, వారి సంక్షేమానికి చేపడుతున్న చర్యలపై పూర్తి సమాచారాన్ని సేకరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర వ్యాప్త పర్యటనలు జరుపుతోందన్నారు. విధి నిర్వహణలోనే నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేయనున్నట్లు తెలిపారు. విద్య ద్వారానే సోషల్ జస్టిస్ సమానత్వం సాధ్యమన్నారు. డీఆర్వో వెంకట రమణ మాట్లాడుతూ డ్రాపవుట్స్, రేగ్యులర్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. బాల్య వివాహాలను క్షేత్రస్థాయిలో నిరోధించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మంచి, చెడు స్పర్శ గురించి విద్యార్థులకు మహిళా సంరక్షణ కార్యదర్శి ద్వారా జిల్లాలో అవగాహన కలిగిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం పద్మావతి బాపట్ల జిల్లా ఏరియా హాస్పిటల్‌ను సందర్శించారు. బాపట్ల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఉమ, జిల్లా ఏఎస్పీ మహేంద్రా, డెప్యూటీ డీఈఓ శ్రీనివాస్, డీఐడీ వెంకటేస్వర్లు అధ్యక్షత వహించారు. బాపట్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ శైలజ, జిల్లా బాలల పరిరక్షణ విభాగ ఇన్‌చార్జి సీడీపీఓ పురుషోత్తం పాల్గొన్నారు.

# విశ్వసనీయతకు చిరునామా ముఖ్యమంత్రి జగనన్న

- నాలుగు విడతల్లో డ్వాక్రా రుణాల చెల్లింపు
- ఎన్నికల హామీని నిలబెట్టుకున్న సీఎం జగన్
- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- రూరల్ మండలంలో వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత సంబరాలు


వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత చెక్‌ను డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: డ్వాక్రా మహిళలు అక్క, చెల్లెమ్మల కళ్లల్లో ఆనందం కోసం ఎన్నికల్లో ఇచ్చిన వైఎస్సార్ ఆసరా హామీని పూర్తిచేసి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయతకు చిరునామాగా నిలిచారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. టౌన్‌హాల్‌లో నరసరావుపేట రూరల్ మండలానికి సంబంధించిన వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత సంబరాలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళల రుణాలను నాల్గవ విడతల్లో మాఫీ చేయడం జరిగిందన్నారు. నాలుగు విడతల్లో దాదాపు రూ.26 వేల కోట్లు రుణాలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. దీని ద్వారా 80 లక్షల మంది డ్వాక్రా మహిళలు లబ్ధి పొందారని వివరించారు. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాల మాఫీ పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు డ్వాక్రా మహిళలను మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల ముందు పసుపు కుంకుమ పేరుతో రూ.10 వేలు చెల్లించి చేతులు దులుపుకున్నారని గుర్తుచేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం జగన్ డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మహిళల పేరు మీదనే అందజేస్తూ వారికి ఆర్థికస్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.


ముఖ్యమంత్రి జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలు తిరిగి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. పేద పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించేందుకు రూ.16 వేల కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పించినట్టు తెలిపారు. విద్యాకానుకతో పాటు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ప్రభుత్వం అందజేస్తుందన్నారు.

చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో కూడా ఒక్క పాఠశాలను కూడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వాన్ని గ్రామాలకు తీసుకెళ్లిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై పచ్చమీడియా, టీడీపీ విషం కక్కుతుందన్నారు. కరోనా కష్టకాలంలో వలంటీర్లు అందించిన సేవలను మరువలేనివని కొనియాడారు. ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్లు ఇంటికి వచ్చి పెన్షన్ అందజేస్తూ సేవలు అందిస్తున్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగిస్తామని చంద్రబాబు చెబుతున్నాడని, దీనివల్ల ప్రజలకు ఎదురయ్యే కష్ట, నష్టాలను వివరించాలని కోరారు. ప్రజలు సొమ్ము ను చంద్రబాబు దోచుకుంటే సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు సీఎం జగన్ అందించారని తెలిపారు. దోచుకోవడం నేరమా పేదలకు అందించడం నేరమా అనేది ప్రజలు ఒకసారి ఆలోచన చేయాలన్నారు.

కార్యక్రమంలో పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ డైరెక్టర్ సుజాతపాల్, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ స్వామి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, ఏపీఎం భరత్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## వియత్నాం విద్యార్థులతో వర్చువల్ భేటీ


వియత్నాం స్కూల్ విద్యార్థులతో వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న విద్యార్థులు

పెసర్లంక(భట్టిప్రోలు): స్థానిక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం వియత్నాం దేశంలోని గార్డెనీయ విన్స్ స్కూల్ విద్యార్థులతో వర్చువల్‌గా భేటీ అయ్యారు. వర్చువల్ విధానంలో ఇరు దేశాలకు చెందిన ఆంగ్లోపాధ్యాయులు స్టెల్లానాక్స్, ఉల్లంగుంట వెంకటేశ్వరరావు విద్యార్థులతో మాట్లాడించారు. అక్కడ జరుగుతున్న నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఇరుదేశాల విద్యార్థులు, వారి సంప్రదాయాలు, పండుగలు తదితర విషయాను చర్చించుకున్నారు. తొలుత వియత్నాం స్కూల్ విద్యార్థులు డాక్యుమెంటేషన్ ఇచ్చారు. అలాగే నూతన సంవత్సర వేడుకలు, పండుగలు, ఆహార పదార్థాలు, స్కూల్ విద్యా విధానం, పరీక్షలు, ఆట పాటల గూర్చి అడిగి తెలుసుకున్నారు. తెలుగువారి దుస్తులు, సంప్రదాయాలు వియత్నాం విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఈ వర్చువల్ విధానం వల్ల స్పోకెన్ ఇంగ్లిష్ స్కిల్స్ పెంపొందుతాయని ఆంగ్లోపాధ్యాయులు వెంకటేశ్వరరావు తెలిపారు. వెంకటేశ్వరరావుతో పాటు సంధాన కర్తగా పరమేశ్వరరావు వ్యవహరించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే మహబూబ్ బాషా వియత్నాం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## ఎస్టీయూ జిల్లా శాఖ నూతన కార్యవర్గం


డి.పెదబాబు


డీకే సుబ్బారెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి ఎన్నికయ్యారు. అదే విధంగా సంఘ జిల్లా ఆర్థిక కార్యదర్శిగా ఎల్.వీరాంజనేయులు, గౌరవాధ్యక్షుడిగా ఏవీ ప్రసాద్‌బాబు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎస్టీయూ బాపట్ల అధ్యక్షుడు బి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు.

# రాష్ట్రస్థాయిలో జిల్లా టీం సత్తాచాటాలి

- నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగండి
- ఆడుదాం ఆంధ్రా క్రీడలపై జేసీ ఎ.శ్యాంప్రసాద్ సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: జిల్లాస్థాయిలో బుధవారం నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలను విజయవంతంగా నిర్వహించి విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడలలో జిల్లాకు కప్ వచ్చేలా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఆడుదాం ఆంధ్ర జిల్లా నోడల్ అధికారి ఎ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం తన చాంబర్‌లో ఆడుదాం ఆంధ్రపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. యువతలోని నైపుణ్యాన్ని వెలికితీసి వారిని ప్రోత్సహించాలనే దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం చేపట్టిందన్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించే క్రీడలను విజయవంతంగా నిర్వహించేలా నిర్దిష్ట ప్రణాళికతో పోటీలను నిర్వహించాలన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి మహిళా టీంలు-5, పురుషులు టీంలు-5 కలిపి వెరసి నియోజకవర్గానికి 10 టీంల వంతున మొత్తం 70 టీంలు ఈ క్రీడలలో పాల్గొంటున్నాయన్నారు.

ఖోఖో క్రీడలు నరసరావుపేట శంకరభారతిపురం పాఠశాల, మిగిలిన క్రీడలు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడలు సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ క్రీడా మైదానంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడల నిర్వహణలో వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు, విద్యా శాఖల సేవలు వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రస్థాయిలో ఫిబ్రవరి ఆరు నుంచి విశాఖపట్నంలో నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడలలో పాల్గొనే క్రీడాకారులకు అన్ని వసతులు, ప్రయాణ సదుపాయ ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన టీంల వివరాలు అందచేయాలన్నారు. పల్నాడు జిల్లాకు కప్ వచ్చేలా చూడాలన్నారు. రెవెన్యూ డివిజినల్ అధికారి ఎం.శేషిరెడ్డి, మండల రెవెన్యూ అధికారి ఆర్‌వీ రమణా నాయక్, డీఎస్‌డీవో సురేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలి

పరీక్షల నిర్వహణ ప్రత్యేక అధికారి టి. శేఖర్ బాబు


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శేఖర్ బాబు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియట్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని పరీక్షల నిర్వహణ ప్రత్యేక అధికారి టి. శేఖర్ బాబు తెలిపారు. కె.ఆర్.జూనియర్ కళాశాల ఆవరణలోని జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయంలో మంగళవారం ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షల నిర్వహణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. సదస్సును జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారిని ఎం.నీలావతి దేవి ప్రారంభించారు. సదస్సులో శేఖర్ బాబు మాట్లాడుతూ ఫిబ్రవరి 2, 3 తేదీలలో నిర్వహించే హ్యూమన్ వ్యాల్యు, పర్యావరణ విద్య పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, మార్కుల నమోదు తదితర అంశాలపై పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లకు వివరించారు. పరీక్ష కేంద్రాల సీఎస్‌లకు పరీక్షల జవాబు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈసీ సభ్యులు బి.వి. కృష్ణారెడ్డి, వి. శ్రీనివాసరావు, ఆర్‌కె. ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రోసూరులో భారీ అగ్నిప్రమాదం

- దగ్ధమైన పత్తి, స్క్రాప్ గోదాము
- కర్మకాండకు టపాసులు కాల్చే క్రమంలో ప్రమాదం


దగ్ధమవుతున్న గోదాము

క్రోసూరు: మండల కేంద్రంలో మంగళవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది కథనం ప్రకారం.. గ్రామంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని కర్మకాండకు తీసుకెళ్తున్న సందర్భంలో బాణసంచా కాల్చారు. ఈక్రమంలో టపాసుల నిప్పురవ్వలు పత్తి, స్క్రాప్ కొనుగోలు చేసే కూరపాటి సైదాకు చెందిన గోదాములో పడి మంటలు రేగాయి. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగబాకి ప్రమాద తీవ్రతను పెంచాయి. ఈ ప్రమాదంలో లక్షల రూపాయల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

## సేంద్రియ వ్యవసాయంతో పోషకాలు మెండు


మాట్లాడుతున్న జిల్లా లాంఫాం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ జీవీఎస్ ప్రసాద్‌రావు


స్టాల్‌లో పంటలను డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ రావుకు వివరిస్తున్న విద్యార్థినులు

- జిల్లా లాం ఫాం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ జీవీఎస్ ప్రసాద్‌రావు
- ఆకట్టుకున్న బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినుల రైతు సదస్సు, పంటల ప్రద్శన

తూములూరు(కొల్లిపర): విచక్షణారహితంగా రసాయన ఎరువుల వాడకంతో.. భూమిలో పంటలకు కావాల్సిన పోషకాలు అందుబాటులో లేక సమతుల్యత లోపించి, ద్వితీయ సూక్ష్మ పోషక లోపాలు పంటల్లో కనిపిస్తున్నాయని గుంటూరు జిల్లా లాం ఫాం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ జీవీఎస్ ప్రసాద్ రావు అన్నారు. వీటిని అధిగమించడానికి సేంద్రియ వ్యవసాయ పద్ధతులు మేలని ఆయన సూచించారు. మంగళవారం మండలంలోని తూములూరు గ్రామంలోని రేణుకదేవి ఆలయ కల్యాణ మండపంలో 30 మంది బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లాలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయంపై తమ పరిశీలనలో పెంచుకున్న అవగాహనను వివరించారు.

వివిధ రకాల పంటలను స్టాల్స్‌లో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టరు జీవీఎస్ ప్రసాద్ రావు పాల్గొన్నారు. విద్యార్థినులు ఏర్పాటు చేసిన వ్యవసాయ పంటల స్టాల్స్‌ను పరిశీలించారు. రైతు సదస్సులో మాట్లాడుతూ వ్యవసాయంలో సాంకేతికను ఉపయోగించుకొని దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. మేలైన వంగడాలను ఉపయోగిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. రైతు సదస్సు కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు వ్యవసాయ విద్యార్థినులను అభినందించారు.

లాంఫాం కో-ఆర్డినేటర్ కిషోర్‌బాబు, టీఓటీ శ్రీలతా వాణి, కీటక శాస్త్రవేత్త నగేష్, మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు, ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి తదితరులు రైతులకు అనేక సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం రైతులకు వ్యవసాయంపై క్విజ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఉత్తమ రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అవుతు శ్రీనివాసరెడ్డి, కొండా కిషోర్‌రెడ్డి, వింతా వేణుగోపాలరెడ్డి, రైతులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9, 10 వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తరాఖండ్‌పై బరోడా ఘన విజయం


3 వికెట్లు తీసిన బౌలర్ ప్రమీలా రావత్


73 పరుగులతో రాణించిన బ్యాటర్ అమృత


4 వికెట్లు తీసిన బౌలర్ జన్‌కి రాథోడ్

మంగళగిరి: నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఉమెన్స్ అండర్-23 వన్ డే ట్రోఫీలో బరోడా జట్టు 78 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి, బ్యాటింగ్ ఎంచుకున్న బరోడా 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. బరోడా జట్టు బ్యాటర్ అమృత జోషెఫ్ 73 పరుగులతో రాణించింది. ఉత్తరాఖండ్ జట్టు బౌలర్లు ప్రమీల రావత్ మూడు వికెట్లు తీసింది. 183 పరుగుల లక్ష్యంలో బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టు 39.04 ఓవర్లలో 104 పరుగులు చేసి, ఆలవుట్టైంది. బరోడా బౌలర్ జన్‌కి రాథోడ్ 4 వికెట్లతో రాణించింది.

### 248 మద్యం బాటిళ్లు స్వాధీనం

సంతమాగులూరు (అద్దంకి): అక్రమంగా దాచి ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామంలో ఎస్సై శివప్రసాద్ సిబ్బందితో మంగళవారం సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అక్రమంగా దాచి ఉంచిన 248 క్వార్టర్ మద్యం బాటిళ్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

## పుస్తక పఠనంతో పొందే విజ్ఞానం శాశ్వతం


మాట్లాడుతున్న అద్దంకి శ్రీధర్‌బాబు


విద్యార్థినుల వీణాగానం

గుంటూరు ఎడ్యుకేషన్: పుస్తక పఠనం ద్వారా పొందే విజ్ఞానం జీవితాంతం మనతోనే ఉంటుందని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ 49వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు గురువుల అడుగుజాడల్లో నడచి, విజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ దినచర్యను పుస్తక పఠనంతో ప్రారంభించి, విజ్ఞానదాయక పుస్తకాలను చదవాలని అన్నారు. లాం వ్యవసాయ వర్సిటీ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఎ.మణి మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు విద్యార్థులు గొప్పకలలు కని, వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సక్రమంగా వినియోగించుకుంటూ కాలాన్ని వృధా చేయకుండా ఉజ్వల భవిష్యత్తు అందిపుచ్చుకోవాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు సంగీత కార్యక్రమాలతో పాటు తెలుగు, ఇంగ్లీషు నాటకాలు, నృత్య నాటికలతో అలరించారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, పాఠశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్. మంగాదేవి, సహ కార్యదర్శి జయశ్రీ, సీఏవో రఘురామ్, ప్రిన్సిపాల్ సుధామాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నర్సింగ్ సూపరింటెండెంట్లకు ఉద్యోగోన్నతులు


ప్రమోషన్ ఆర్డర్స్ అందజేస్తున్న ఆర్డీ డాక్టర్ శోభారాణి

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో హెడ్ నర్సులుగా పనిచేస్తున్న ఐదుగురికి మంగళవారం గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు(ఆర్డీ) కార్యాలయంలో పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లుగా ప్రమోషన్ ఇచ్చారు. గుంటూరు జీజీహెచ్‌లో హెడ్ నర్సులుగా పనిచేస్తున్న సి.హెచ్.కమలకుమారి, కె.గ్లాడిస్ వియోలా, నున్నా ఇందిరాదేవిలకు ప్రమోషన్ ఇచ్చి గుంటూరు జీజీహెచ్‌లోనే గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లుగా పోస్టింగ్ ఇచ్చారు. ఒంగోలు జీజీహెచ్‌లో పనిచేస్తున్న సి.హెచ్. అనంతలక్ష్మికి ఒంగోలు జీజీహెచ్‌లో, నెల్లూరు ఏసీఎస్ఆర్ గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న వి.మల్లేశ్వరికి ఒంగోలు జీజీహెచ్‌లో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లుగా పోస్టింగ్ ఇచ్చారు. ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, సూపరింటెండెంట్ సుధీర్, సీనియర్ అసిస్టెంట్ నాగూర్ షరీఫ్ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు.

## టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత నమోదు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత నమోదు చేసేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు శివారు అడవి తక్కెళ్లపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన డీఈవో శైలజ నాడు-నేడు రెండో దశలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించి, రివిజన్‌పై విద్యార్థులతో మాట్లాడారు. ప్రీ-ఫైనల్, పబ్లిక్ పరీక్షలకు ప్రతి రోజూ ప్రణాళిక ప్రకారం సన్నద్ధం కావాలని సూచించారు. ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌కు ఉపాధ్యాయులందరు హాజరు కావడంతోపాటు, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. పరీక్షలపై అర్థం లేని భయం, ఆందోళనకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో సన్నద్ధమయ్యేందుకు సలహాలు, సూచనలు అందజేశారు. జగనన్న గోరుముద్ద నాణ్యతపై విద్యార్థులతో మాట్లాడిన డీఈవో శైలజ సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈవో వెంట ప్రధానోపాధ్యాయురాలు కె.జయశ్రీ, ఉపాధ్యాయులు కె.రవికుమార్, సుధారాణి ఉన్నారు.